క్లుప్తంగా

మండలి చైర్మన్ పరామర్శ



యాదగిరిరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గుత్తా, బండా నరేందర్‌రెడ్డి

మునుగోడు: ఇటీవల అనారోగ్యంతో మరణించిన మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ ఎంపీపీ మాదిరెడ్డి యాదగిరిరెడ్డి కుటుంబ సభ్యులను శనివారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా యాదగిరిరెడ్డి చిత్రపటానికి గుత్తా పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, పాల్వాయి చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటరు సవరణకు సహకరించాలి

నకిరేకల్: ఓటరు సవరణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి సూచించారు. ఓటరు సవరణకు సంబంధించి శనివారం నకిరేకల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల డీటీ పొట్టబత్తుల శ్రీనివాస్, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

జనరల్ సెక్రటరీగా సిద్దార్థ

నల్లగొండ: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కంటి సిద్దార్థ యూత్ కాంగ్రెస్ నల్లగొండ పట్టణ జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. శనివారం పట్టణంలోని ఎంపీ కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు.

అభివృద్ధికి సహకరించాలి

చండూరు: చండూరు మున్సిపాలిటీ అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ అన్నారు. శనివారం మున్సిపల్ పాలకవర్గ సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో 9 తీర్మానాలు ప్రతిపాదించగా, 6 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మిగతా 3 తీర్మానాలను వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖాజా మోయినుద్దీన్, కౌన్సిలర్లు అన్నెపర్తి శేఖర్, అనంత మంగమ్మ, కొన్రెడ్డి యాదయ్య, చిలుకూరి రాధిక శ్రీనివాస్, తోకల వెంకన్న, గంటి వెంకటేశం, కోఆప్షన్ సభ్యులు సంకోజు దుర్గమ్మ, రవిరాల నగేష్, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, ఆర్ఐ అరుణకుమారి, ఎం. అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

కనగల్: తమ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం గ్రామపంచాయతీ కార్మికులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఎంపీపీ కరీంపాషకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కానుగు లింగస్వామి మాట్లాడుతూ.. కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వారికి జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు కొంగల నర్సింహ, రాములు, ముత్తయ్య, మంజుల, మణెమ్మ, జ్యోతి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై ఆగ్రహం

కనగల్: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ కరీంపాష అధ్యక్షతన జరిగింది. ధాన్యం కొనుగోళ్లపై సాక్షి దినపత్రికలో వచ్చిన కథనంపై సంబంధిత అధికారులను ఎంపీపీ వివరణ కోరి వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో లారీల సమస్య తీవ్రంగా ఉందని పలువురు ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పనులను అనుసంధానించాలని తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

నాంపల్లి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీల కొరత తీవ్రంగా ఉందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని శనివారం కొనుగోలు కేంద్రం ముందు రోడ్డుపై పీఏసీఎస్ చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డితో కలిసి రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పూల వెంకటయ్య, సింగిల్ విండో డైరెక్టర్స్ సత్యనారాయణ, పార్వతమ్మ, వెంకట్‌రెడ్డి, రైతులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి చుట్టూ రింగ్ రోడ్డు

- పట్టణంలో 16 లింక్ రోడ్లు విస్తరించేందుకు నిర్ణయం
- వార్డుకు కోటి రూపాయలు కేటాయించి అభివృద్ధి చేస్తా
- మే 15న నల్లగొండకు రానున్న మంత్రి కేటీఆర్.. పూర్తయిన అభివృద్ధి పనుల ప్రారంభం
- నీలగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, చిత్రంలో చైర్మన్ సైదిరెడ్డి, కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్: నీలగిరి పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, నల్లగొండను హైదరాబాద్ నగరానికి దీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నీలగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్ రోడ్డులోని ఏఎమ్మార్పీ కాల్వ పక్క నుంచి గుండ్లపల్లి, రసూల్‌పురం మీదుగా అనిశెట్టి దుప్పలపల్లిలోని అద్దంకి ప్రధాన రహదారికి రింగ్ రోడ్డు కలపనున్నట్లు తెలిపారు. పట్టణంలో కూడా 16 లింక్ రోడ్లను విస్తరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఎన్జీ కాలేజీ నుంచి చకిలం శ్రీనివాసరావు విగ్రహం వరకు, ఎన్టీఆర్ విగ్రహం నుంచి రామగిరి వరకు, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పద్మావతి కాలనీ మీదుగా సావర్కనగర్ వరకు రోడ్ల విస్తరణ ఉంటుందన్నారు. ప్రతి వార్డుకు కోటి రూపాయలు కేటాయించి కాలనీలను అభివృద్ధి చేస్తానని తెలిపారు. 20ఏళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి చేయని అభివృద్ధిని తాను ఐదేళ్లలో చేస్తున్నానని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. పట్టణంలో తాగు నీటి రెండో పైప్‌లైన్ వేసి పుష్కలంగా నీరుస్తున్నామని, రూ.420 కోట్లతో 48 ట్రాక్టర్లు, ఆటోలు కొనుగోలు చేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నామన్నారు. మే 15న రూ.216 కోట్లతో కళాభారతి, పానగల్ ఉదయ సముద్రం బండ్‌కు మంత్రి కేటీఆర్ ఫౌండేషన్ వేస్తారని తెలిపారు. అదేవిధంగా పూర్తయిన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభిస్తారన్నారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ పట్టణంలో రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులు శరవేగంగా నడుస్తున్నాయని అన్నారు. పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటన్నింటిని పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఎజెండా ఆమోదిస్తున్నట్లు చైర్మన్ సైదిరెడ్డి ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మున్సిపల్ ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, వివిధ పార్టీల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

- కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యం రాసులు



వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతులు

శాలిగౌరారం: మండలంలో శనివారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాలలోని ధాన్యం తడిసిపోయింది. మండలంలో ఏర్పాటు చేసిన 12 కొనుగోలు కేంద్రాలలో సుమారు 1.20లక్షల క్వింటాళ్ల ధాన్యం రాసులు నిల్వ ఉన్నాయి. అకాల వర్షానికి ఆయా కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యింది. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో వరద ప్రవాహానికి ధాన్యం కొట్టుకుపోయింది. అదేవిధంగా ఆయా కొనుగోలు కేంద్రాలలో శనివారం ఉదయం తూకం వేసిన 15వేల ధాన్యం బస్తాలు వర్షానికి తడిసిపోయాయి. మండలంలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్

తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. తడిసిన ధాన్యం బస్తాలను ఆరబెట్టిన వెంటనే మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.

కాంగ్రెస్‌దే అధికారం

నకిరేకల్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. శనివారం నకిరేకల్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లగొండలో శుక్రవారం జరిగిన నిరుద్యోగ నిరసన దీక్షకు తరలివచ్చిన జనాన్ని చూస్తే ఉమ్మడి జిల్లాలో అన్ని అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో పాటు రాష్ట్రంలోనూ అధికారం చేపట్టబోవడం ఖాయమన్నారు. సమావేశంలో సుంకరబోయిన నర్సింహాయాదవ్, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, యాసా కరుణాకర్ రెడ్డి, జటంగి వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



నాంపల్లి: కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

మర్రిగూడ: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, శివన్నగూడలోని ఎఫ్ఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పరిశీలించారు. శివన్నగూడలో లారీల కొరత ఉందని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

నాంపల్లిలో..

నాంపల్లి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సందర్శించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు, ప్రాథమిక సహకార బ్యాంకు చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి, సీఈఓ పూల శ్రీరాములు, డైరెక్టర్లు, రైతులు ఉన్నారు.

ధాన్యం దిగుమతిలో వేగం పెంచాలి..

నల్లగొండ రూరల్: ధాన్యం దిగుమతిలో మిల్లర్లు వేగం పెంచాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు మిల్లర్లకు సూచించారు. శనివారం నల్లగొండ పట్టణ శివారులోని కతాల్‌గూడెంలో గల బాలాజీ రైస్‌మిల్లు వద్ద ధాన్యం దిగుమతిని ఆయన పరిశీలించారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి..

చండూరు: రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. శనివారం ఆయన చండూరు మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట తహసీల్దార్ అర్చనారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సైదులు ఉన్నారు.

ఫార్మా అనుమతులు రద్దు చేయాలని నిరసన



ఫార్మా అనుమతులు రద్దు చేయాలని నిరసన తెలుపుతున్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

మునుగోడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ గ్రామాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అంతకు ముందు వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కిష్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మా కంపెనీని వెంటనే రద్దు చేయాలని సమావేశానికి హాజరైన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు నేలపై కూర్చొని నిరసన తెలిపారు. అదేవిధంగా తమ గ్రామపంచాయతీ ఖాతాల్లోని ఎస్ఎఫ్‌సీ నిధులపై ఫ్రీజింగ్‌ని ఎత్తివేయించాలని ఎంపీపీ, ఎంపీడీఓకి వినతి పత్రం అందించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులని రెగ్యులర్ చేయాలని సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌భాస్కర్, తహసీల్దార్ ఎం. క్రిష్టారెడ్డి, వైఎస్ ఎంపీపీ అనంత వీణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నదీ యాజమాన్య బోర్డును రద్దు చేయాలి



నాంపల్లి: పాదయాత్రకు మద్దతు తెలుపుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్

నాంపల్లి: కృష్ణా నదీ యాజమాన్య బోర్డును రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. 10వ రోజు పాదయాత్రలో భాగంగా శనివారం మండలంలోని పెద్దాపురం, రాందాస్‌తండా, నర్సింహులగూడెం గ్రామాలల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. నర్సింహులగూడెం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం టీపీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్ పాదయాత్రకు మద్దతు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి కృష్ణా నది ద్వారా 411టీఎంసీల నీటి కేటాయింపులు దక్కాల్సింటే, ప్రస్తుతం 200 టీఎంసీలకే పరిమితం చేశారని ఆరోపించారు. గొల్ల కురుమలు డీడీలు చెల్లించి నెలలు గడుస్తున్నా వారికి గొర్రెలు పంపిణీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నెల్లికంటి సత్యం సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. అంజచారి, శ్రీనివాస్, బచ్చనగోని గాలయ్య, గురిజ రామచంద్రం, బొలుగూరి నర్సింహ, తీర్పారి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చండూరులో..

చండూరు: సీపీఐ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధి– పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం చేపట్టిన పాదయాత్ర శనివారం మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చేరుకుంది. అనంతరం తిమ్మారెడ్డిగూడెం, దోనిపాముల గ్రామాలలో పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. కృష్ణా నదిలో మిగులు జలాలను వాడుకునేందుకు చేపడుతున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులకు అనుమతులు లేవని కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆరోపించారు. పాదయాత్రలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. అంజయ్య చారి, కే. శ్రీనివాస్, బి. గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి మందిరం వార్షికోత్సవాలు

నకిరేకల్: పట్టణంలోని ఐశ్వర్యసాయి మందిరం 16వ వార్షికోత్సవం, శ్రీశ్రీశ్రీ జ్ఞాన సరస్వతీదేవి 8వ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి దుర్గి మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో మహా నైవేద్యం, మహా హారతి నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం గంగాధరశాస్త్రిచే నిర్వహించిన గీతాజ్ఞాన గానామృతం ఆకట్టుకుంది. టీపీసీసీ నేత దైద రవీందర్ పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కాసం లింగయ్య, ప్రధాన కార్యదర్శి బొల్లం సత్తయ్య, ట్రస్ట్ ఉపాధ్యక్షులు యాట మధుసూదన్‌రెడ్డి, వనమా వెంకటేశ్వర్లు, కోశాధికారి ముప్పారం శ్రీనివాస్, ఆలయ ట్రస్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'ఎన్ఆర్' విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎన్ఆర్ విద్యాసంస్థల యాజమాన్యం

రామగిరి (నల్లగొండ): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నల్లగొండ ఎన్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యాసంస్థల నల్లగొండ జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ బ్రాంచి విద్యార్థి ఎస్. దత్తు ఎస్టీ కేటగిరీలో ఆలిండియా 481 ర్యాంకు, మరో విద్యార్థి శేఖర్ ఎస్సీ విభాగంలో 5013 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఏడుగురు 100లోపు ర్యాంకులు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సంస్థ చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, సీఈఓ సురేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ అభినందించారు.

సత్తాచాటిన ప్రగతి కళాశాల విద్యార్థులు



చరణ్ ప్రకాష్



శివ

రామగిరి(నల్లగొండ): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. కళాశాలకు చెందిన రాసమల్ల చరణ్ ప్రకాష్ ఎస్సీ కేటగిరీలో ఆలిండియా 1557వ ర్యాంకు, బి. శివ ఓబీసీ కేటగిరీలో 2794వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా వివిధ కేటగిరీలలో ఎల్. గణేష్ 3414వ ర్యాంకు, ఎస్. శ్రీరామ్ 3655, ఆర్. ఆదర్శ్ 4807, ఎం. శ్రీను 8302, ఆర్. రాహుల్ 10253, ఎ. శ్రీహరి 12274, బి. శరత్, 12293, ఆర్. సాయికిరణ్ 14053, ఎ. అశ్వంత్‌కుమార్ 17872 ర్యాంకులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం పేర్కొన్నారు. 63 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఏ. నరేందర్ బాబు, ఎస్. శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ నేతలకు కర్రు కాల్చి వాత పెడ్తరు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: సీఎం కేసీఆర్ గురించి అడ్డుగోలుగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలకు వచ్చే ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్లంతా ముఖ్యమంత్రి, మంత్రి పదవుల కోసం పోటీ పడుతున్నారని, నిరుద్యోగ నిరసన దీక్ష పేరుతో నల్లగొండలో నిర్వహించిన సభలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులు తప్ప నిజమైన నిరుద్యోగులు ఒక్కరూ లేరన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటి వరకు 1.50లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని అన్నారు. పదవుల కోసం పాకులాడే కాంగ్రెస్ నాయకులు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. సీఎం కేసీఆర్ తన హామీకి కట్టుబడి నల్లగొండ అభివృద్ధికి వందల కోట్ల రూపాయలు ఇచ్చాడని పేర్కొన్నారు. 20ఏళ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి నల్లగొండకు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఏం చేశాడని ప్రశ్నించారు. సమావేశంలో నారి నరసింహ, పోలోజు వెంకటాచారి, మహేందర్ రెడ్డి, ఆకుతోట వెంకటేశ్వర్లు, మారగోని అంజయ్య, కంచర్ల శ్రవణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ వెంటే తెలంగాణ ప్రజలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్: తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ వెంటే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ సీట్లనూ బీఆర్ఎస్ పార్టీ గెలుచుకుంటుందని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల గొండ పట్టణంలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన సభలో సీఎం కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలను ఎమ్మెల్యే ఖండించారు. ఈ మేరకు నకిరేకల్ పట్టణంలోని నిమ్మ మార్కెట్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్‌రెడ్డి తన స్వలాభం కోసం టీడీపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరాడని అన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా రేవంత్‌రెడ్డి మారాడని విమర్శించారు. కోట్ల రూపాయలతో పీసీసీ పదవిని కొనుకున్నాడని ఆరోపించారు. తెలంగాణలో కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలించిందన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డిపై చేసిన వాఖ్యలపై రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పెండెం సదానందం, సోమ యాదగిరి, మంగినపల్లి రాజు, మట్టిపల్లి వీరు, రావిరాల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నకిరేకల్: నిమ్మ మార్కెట్‌లో క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డలో గల నిమ్మ మార్కెట్‌లో రూ.20లక్షలతో నిర్మించిన క్యాంటీన్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాధ ధనలక్ష్మీనగేష్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీని వాస్‌గౌడ్, మార్కెట్ కార్యదర్శి శ్రీనాథరాజు, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా కేసీఆర్ పాలన..

కేతేపల్లి: సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని తుంగతుర్తి, కేతేపల్లి గ్రామాలలో శనివారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం భీమారం జెడ్పీ హెచ్ఎస్‌లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.25లక్షలతో కల్పించిన మౌలిక సదుపాయాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలల్లో అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతాసురేష్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ రమేష్ దీన్ దయాల్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బడుగుల శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న, సర్పంచులు కొండ సరితాసైదులు, జాల వెంకట్‌రెడ్డి, బచ్చు జానకిరాములు, ఎంపీటీసీలు దాచేపల్లి నర్మదనాగేశ్వరావు, ఎ. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

చిట్యాల: పట్టణ శివారులోని శ్రీబాలనర్సింహస్వామి ఆలయంలో మే 5న నిర్వహించనున్న కల్యాణోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నార్కట్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాకులారపు బొర్రారెడ్డి, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, కోనేటి క్రిష్ణ, బీఆర్ఎస్ నాయకులు జిట్ట బోందయ్య, సిలివేరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి కృషి



రామగిరి(నల్లగొండ): ఫాదర్ జూలియస్‌ను సన్మానిస్తున్న రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయం అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని మదర్ థెరిసా ట్రస్ట్ చారిటీ చైర్మన్ ఫాదర్ పులిశెట్టి జూలియస్ అన్నారు. శనివారం గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డితో కలిసి జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి పాఠకులతో మాట్లాడారు. రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయ అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాడుతో పాటు దాతల సహాయ సహకారాలు అవసరమని అన్నారు. అనంతరం ఫాదర్ జూలియస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎస్. నర్సింహారెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ కట్ట నాగయ్య, జూనియర్ అసిస్టెంట్ ఎం. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొలువులకు గ్రంథాలయాలు..

కనగల్: ప్రభుత్వ కొలువులు సాధించే యువతకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శనివారం కనగల్ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. గ్రంథాలయాల్లో చదివి ప్రభుత్వ కొలువులు సాధించిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. అదేవిధంగా గ్రంథాలయానికి అవసరమైన కుర్చీలు, ఫర్నీచర్, ర్యాక్స్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్. కుసుమ, చైర్మన్ బచ్చగోని కిరణ్, నెలగొందరాశి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ టూటౌన్: సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం బీఆర్ఎస్వీ నాయకులు పట్టణ కేంద్రంలో దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లా అభివృద్ధిని పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఇష్టానుసారంగా మాట్లాడడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో అంబటి రాంబాబు, నోముల క్రాంతియాదవ్, నోముల శంకర్, కందుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి ఆవు మృతి

చండూరు(గట్టుప్పల): గట్టుప్పల మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పిడుగుపాటుకు మండల కేంద్రానికి చెందిన కుండె భిక్షమయ్య ఆవు మృతిచెందింది. తనను ఆదుకోవాలని బాధితుడు శనిఆరం మండల తహసీల్దార్‌కు కలిసి విన్నవించాడు.

ఎమ్మెల్యేకు వినతి

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని మునుగోడు రోడ్డులో గల ఈద్గా వద్ద నుంచి మున్సిపాలిటీ శివారు పరిధి వరకు 100 ఫీట్ల రోడ్డు వేయాలని, అదేవిధంగా ఈద్గా నుంచి డీవీకే రోడ్డు వరకు గల రోడ్డును 150 ఫీట్లకు విస్తరించాలని 28వ వార్డు కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌యాదవ్ శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రాజీవ్‌గృహకల్ప నుంచి నుంచి కతాల్‌గూడ వరకు 100 ఫీట్ల రోడ్డు, గుండ్లపల్లి ఎక్స్ రోడ్డు నుంచి మున్సిపల్ పరిధి వరకు 100 ఫీట్ల రోడ్డుగా విస్తరణ చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు.

ప్రశాతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

రామగిరి(నల్లగొండ): నాగార్జునసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 5వ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి నల్ల గొండ జిల్లాలో శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు మొత్తం 18 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. మొత్తం 3599 మంది విద్యార్థులకు గాను 3194 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 435 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



రాములు (ఫైల్)

శాలిగౌరారం: మండలంలోని ఎన్జీ కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్, సీపీఎం సీనియర్ నాయకుడు సూరారం రాములు(75) అనారోగ్యంతో శనివారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మృతిచెందారు. రాములు 1987–92 మధ్య ఎన్జీ కొత్తపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. రాములు భార్య లీలమ్మ 2001–06 వరకు శాలిగౌరారం ఎంపీపీగా పనిచేసింది. మృతుడికి నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

చిట్యాల: మండల పరిధిలోని వెలిమినేడు గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు దేశబోయిన స్వరూపనర్సింహా శనివారం చిట్యాల ట్రాన్స్‌కో ఏఈ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని లోఓల్టేజీ నివారణకు గాను అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయాలని, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఏఈని కోరారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

నాంపల్లి: బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నాంపల్లిలోని నక్క సునంద ఫంక్షన్‌హాల్‌లో పూల వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను ప్రతి బూత్‌లో 100మందితో వీక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం, జిల్లా కార్యదర్శి దర్శనం వేణు, ఎరెడ్ల రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి, పోచంరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నార్కట్‌పల్లికి చేరుకున్న జీపు జాత

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి ఆర్టీసి డిపో ఎత్తివేతకు స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బాధ్యత వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాత శనివారం మూడో రోజు నార్కట్‌పల్లి పట్టణానికి చేరుకుంది. కార్యక్రమంలో నార్కట్‌పల్లి, చిట్యాల, నకిరేకల్ మండలాల సీపీఐ కార్యదర్శులు పెండ్యాల శంకర్, ఎండీ అక్బర్, లక్ష్మీనరసయ్య, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, ఏనుగుల యోగేందర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి శ్రీపతి స్వామి తదితరులు పాల్గొన్నారు.